క్లుప్తంగా

దుర్గమ్మకు నృత్యాంజలి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న ఆషాఢ మాసోత్సవాలలో భాగంగా ఆదివారం పలువురు కళాకారులు తమ కళాప్రదర్శనలతో అందరినీ అలరించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదిక వద్ద విజయవాడకు చెందిన కోలాట బృందం కోలాటాన్ని ప్రదర్శించింది. సాయంత్రం విజయవాడకు చెందిన చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను వీక్షించి చిన్నారులను అభినందించారు.

నేడు 'వీఎంసీ పీజీఆర్ఎస్'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ నగర వాసులకు కల్పించే మౌలిక వసతుల్లో నెలకొనే సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాఫిర్యాదులు-పరిష్కార కార్యక్రమం(పీజీఆర్ఎస్) వీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు నగరంలోని మూడు సర్కిళ్లలో నిర్వహిస్తున్నామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం చిట్టినగర్‌లోని సర్కిల్-1 కార్యాలయం, సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయం, పటమటలోని సర్కిల్-3 కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. ఆయా కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు, ఇతర విభాగాల అధికారులు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని చెప్పారు. నగర వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

టీడీపీ గూండాల దాడి దుర్మార్గం: దేరంగుల

భవానీపురం(విజయవాడపశ్చిమ): సభ్య సమాజం తలదించుకునేలా ఓ బీసీ మహిళా ప్రజాప్రతినిధి, ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన గూండాలు దాడి దుర్మార్గమైన చర్య అని వైఎస్సార్ సీపీ నాయకుడు, ఏపీ వడ్డెర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ దేరంగుల వెంకట రమణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హారికను అసభ్యపద జాలంతో దూషించడమే కాకుండా ఆమె కారును కర్రలు, బండ రాళ్లతో ధ్వంసం చేయడం అనాగరిక చర్య అన్నారు. రాష్ట్రంలో లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని పోలీసులను అడ్డం పెట్టుకుని కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై చేస్తున్న దౌర్జన్యాలకు పాల్పడుతోందని విమర్శించారు. ఉప్పాల హారిక దంపతులపై దాడికి బాధ్యులైనవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని వారిని శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

హారికపై దాడి సిగ్గుమాలిన చర్య

వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌రాజ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వ పాలనలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతుందనడానికి జెడ్పీ చైర్‌పర్సన్, ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రథమ పౌరురాలు ఉప్పాల హారికపై జరిగిన దాడి నిదర్శనమని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్‌రాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ, జనసేన గూండాలు సిగ్గువిడిచి మహిళలపై కూడా దాడికి దిగటం చూసి సభ్యసమాజం తల దించుకుంటుందని తెలిపారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం చూస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధికే భద్రత లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై ఎన్ని దాడులు చేసినా, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా వారి మనోధైర్యాన్ని అంగుళం కూడా తగ్గించలేరని పేర్కొన్నారు. ఉప్పాల హారిక దంపతులకు వెంటనే క్షమాపణలు చెప్పి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బీసీల అభ్యున్నతికి పాటుపడాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బీసీల అభ్యున్నతికి పాటుపడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గొలగాని శ్రీనివాసరావుకు ఆపార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెలంపల్లి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక బ్రాహ్మణ వీధిలోని పశ్చిమ నియోజకవవర్గ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, వెలంపల్లి శ్రీనివాసరావును గొలగాని శ్రీనివాసరావు ఆదివారం కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు గొలగాని శ్రీనివాసరావును శాలువాతో సన్మానించి అభినందించారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేయాలని కోరారు. అందరూ సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

కొండ ప్రాంతాల్లో నీటికి కటకట

- 10 డివిజన్లలో నీటి ఇబ్బందులు
- సరిగా నీరు అందక అవస్థలు పడుతున్న ప్రజలు
- సమస్య పరిష్కరించాలని వినతి



కొత్తపేట కొండ ప్రాంతంలో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలోని కొండ ప్రాంత నివాసితులు మంచినీటికి కటకటలాడుతున్నారు. నియోజకవర్గంలో సుమారుగా పదికి పైగా డివిజన్‌లు కొండ ప్రాంతాల్లోనే ఉన్నాయి. ఇటీవల వివిధ విభాగాల్లో పని చేసే కాంట్రాక్ట్ కార్మికులు సమ్మెబాట పట్టడంతో నియోజకవర్గంలో నీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ వాటర్ వర్క్స్, పార్కులు, స్ట్రీట్‌లైట్స్, యుజీడీ తదితర విభాగాల్లో పని చేస్తున్న కార్మికులు సమ్మెకు దిగారు. కార్మికులు సమ్మెకు దిగటంతో నియోజకవర్గంలో వాటర్ వర్క్స్‌కు సంబంధించి పని చేస్తున్న సిబ్బంది అందుబాటులో లేకపోవటంతో కొండ ప్రాంతాల్లో అధికంగా నీటి సమస్యలు తలెత్తుతున్నాయి. దాంతో స్థానిక ప్రజానీకం అవసరమైన నీరు అందక అల్లాడిపోతున్నామంటూ వాపోతున్నారు.

ఇక్కట్ల పాలవుతున్న కొండ ప్రాంతవాసులు.....

నియోజకవర్గంలోని కొండ ప్రాంతాల్లో మంచినీరు సకాలంలో సరిపడ అందక స్థానిక నివాసితులు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. ముఖ్యంగా హెడ్ వాటర్ వర్క్స్ నుంచి వచ్చే నీటిని స్థానికంగా ఉండే ఆయా వాటర్ ట్యాంక్‌లలోకి బూస్టర్లు, ఇతర మోటర్ల సాయంతో నింపాల్సి ఉంటుంది. అవి నిండిన తరువాత ఉదయం, సాయంత్రం నియమిత సమయాల్లో ఆయా స్థానిక ప్రాంతాలకు మంచి నీటిని వదలటం పరిపాటి. అయితే సిబ్బంది సమ్మెబాట పట్టడంతో ఉన్న పర్మినెంట్ సిబ్బంది, వివిధ రూపాల్లో పని చేస్తున్న తాత్కాలిక సిబ్బందికి ఒకరికి నాలుగైదు బాధ్యతలు అప్పగించి పనులను నిర్వహింపజేస్తున్నారు. దాంతో నీటిని నింపటం, వదలటం సకాలం జరగటం లేదు. అంతేకాకుండా పూర్తి స్థాయిలో నీరు అందటం లేదు.

కొద్దిసేపటికే నిలిచిపోతున్న నీళ్లు...

కొండ ప్రాంతాల్లో కొద్దిసేపటికే నీటి విడుదల నిలిచిపోతుందని స్థానిక ప్రజానీకం చెబుతుంది. ఉదయం సాయంత్రం వేళల్లో నీటిని విడుదల చేసినప్పుడు ప్రజలు వాటిని పట్టుకొని నిల్వ చేసుకుంటారు. అయితే కొద్దిసేపటికే నీరు నిలిచిపోవటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అలాగే భవనాల్లో నివాసాలు ఉండే నివాసితులు తమ ట్యాంక్‌లను సైతం మోటర్ల ద్వారా నింపుకొని వాడుకుంటారు. మోటర్లు పని చేస్తున్న వాటికి కూడా నీరు పూర్తిస్థాయిలో రాకపోవటంతో నీటికి అల్లాడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి



నియోజకవర్గంలోని కొండ ప్రాంతాల్లో మంచినీటి సమస్యలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. కొండ ప్రాంత సమస్యలపై ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినా పాలకులు, అధికారులు పట్టించుకోవటం లేదు. నీరు అందక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిపై నగరపాలకసంస్థ అధికారులు స్పందించాలి. కొండ ప్రాంతాల్లో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలి.

– కె.సూరిబాబు

కూటమి మోసాలను వివరించండి



క్లస్టర్-5 సమావేశంలో మహానేత విగ్రహానికి నివాళులర్పిస్తున్న వెలంపల్లి తదితరులు



క్లస్టర్-2 కమిటీలో క్యూఆర్ కోడ్ పత్రాలు ఆవిష్కరిస్తున్న వెలంపల్లి, పుణ్యశీల తదితరులు

- కస్లర్-2, 5 కమిటీల సమావేశంలో వెలంపల్లి శ్రీనివాసరావు
- క్యూఆర్ కోడ్ కరపత్రాల ఆవిష్కరణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు వివరించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. పశ్చిమ నియోజకవర్గం పార్టీ క్లస్టర్ -2 కమిటీ విస్తృత స్థాయి సమావేశం కమిటీ అధ్యక్షుబు వాసా ఆదినారాయణ ఆధ్వర్యంలో, క్లస్టర్-5 విస్తృత సమావేశం కమిటీ అధ్యక్షురాలు బంకా చాముండేశ్వరి ఆధ్వర్యంలో వేర్వేరుగా పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వెలంపల్లి శ్రీనివాసరావు కార్పొరేటర్లు బండి పుణ్యశీల, శిరంశెట్టి పూర్ణచంద్రరావు, యలకల చలపతిరావు తదితరులతో కలిసి మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించి సమావేశాన్ని ప్రారంభించారు. బాబు మోసాలను, ప్రజలకు ఇచ్చిన బాండ్లు, టీవీలో చూపించారు. ఇంటింటికి క్యూఆర్ కోడ్‌తో వెళ్లి ప్రజలతో కోడ్‌ని స్కాన్ చేపించి కూటమి మోసాలను వివరించాలని కోరారు. ఈ సందర్భంగా క్యూఆర్ కోడ్‌ని ఆవిష్కరించారు. అనంతరం వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు మోసపూరిత హామీలను, తప్పుడు వాగ్దానాలను ప్రజలకి గుర్తుకు తెచ్చేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి గడపకు వెళ్లి ఇచ్చిన హామీలు, అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలనడిగి తెలుసుకునేవాళ్లమన్నారు. రానివాళ్ళకి అక్కడికక్కడే పరిష్కారం చేశామన్నారు. రానున్న రోజుల్లో డివిజన్ స్థాయిలో చేపట్టే ఈ కార్యక్రమంలో ప్రజలకు చంద్రబాబు మోసపూరిత వాగ్దానాల గురించి వివరించి గుర్తు చేయాలన్నారు. పథకాలు వచ్చాయా లేదా అని అడగాలన్నారు. గతంలో లోకేష్ ఎన్నికల అయిన వెంటనే నిరుద్యోగ భృతి ఇచ్చేస్తానని చెప్పాడని ఇప్పుడేమో దాని గురించి మాట్లాడటం లేదన్నారు. డివిజన్ ఇన్‌చార్జులు తంగెళ్ల రామచంద్రరావు, గురుమహంతు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసునికి పంచామృత అభిషేకాలు



స్వామికి అభిషేకాలు చేస్తున్న ఆలయ అర్చకులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లో వేం చేసిన పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారికి ఆదివారం విశేష అభిషేకాలు, అలంకరణ, పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము ఆరు గంటలకు స్వామి వారికి సుప్రభాత సేవ అనంతరం పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, తులసీ దళ అర్చన చేశారు. ఆలయ అర్చకులు వినుకొండ రత్నమాచార్యుల బృందం స్వామి వారికి పూజలు చేయగా, అభిషేకాలను వీక్షించేందుకు తరలివచ్చిన భక్తజనంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. స్వామి వారికి అభిషేకాలు నిర్వహిస్తుండగా, మరో వైపున భక్తులు గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. స్వామి వారికి పంచహారతుల సేవ నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు. స్వామి వారికి ప్రతి మాసంలో శ్రవణా నక్షత్రంన విశేష అభిషేకాలు జరుగుతాయని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను పగులకొట్టమన్న లోకేష్ ఎక్కడ?

సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి సత్యబాబు



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్యబాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగులకొట్టండని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రెచ్చిపోయిన ప్రస్తుత మంత్రి నారా లోకేష్ ఎక్కడున్నారని సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి మంత్రి అవ్వగానే నాడు తప్పుగా కనిపించిన స్మార్ట్ మీటర్ల బిగింపు నేడు ఒప్పుగా కనిపిస్తుందా నిలదీశారు. విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా సీపీఎం పశ్చిమ నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోరుబాట కార్యక్రమం రెండవ రోజు ఆదివారం రామరాజ్యనగర్ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద కొనసాగింది. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ ఆదాని, సెకీ ఒప్పందాల వలన రానున్న 25 ఏళ్లలో 1,25,000 కోట్ల భారం రాష్ట్ర ప్రజలపై పడుతుందని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే ఆయా ఒప్పందాలను రద్దు చేస్తామన్న చంద్రబాబు వాటిని కొనసాగిస్తూ అవినీతిపరులకు పెద్దన్నగా నిలిచారని ధ్వజమెత్తారు. గతంలో బీజేపీ ప్రభుత్వం ప్రజలపై వేసిన విద్యుత్ భారాల బాటలోనే నేటి కూటమి ప్రభుత్వం మరిన్ని భారాలు వేస్తుందని విమర్శించారు. సర్దుబాటు, సర్ చార్జీలు, ఓవర్ లోడ్, కస్టమర్, ఎఫ్‌పీపీసీఎస్ వంటి చార్జీలతో బాదుడే బాదుడుగా డబుల్ ఇంజన్ సర్కార్ ఏడాదిలో రూ.25వేల కోట్ల భారాలను మోపిందని వెల్లడించారు. ఇప్పటికే కమర్షియల్ పేరుతో బిగించిన స్మార్ట్ మీటర్ల బిల్లులతో చిన్న, మధ్య తరగతి వాపారస్తులు బెంబేలెత్తిపోతున్నారని తెలిపారు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సీఎం చంద్రబాబు పాలనలో హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో జరిగిన విద్యుత్ పోరులో చనిపోయిన అమరవీరుల సాక్షిగా విద్యుత్ పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా స్మార్ట్ మీటర్ల బిగింపుపై ప్రజల అభ్యంతరాలను సబ్ స్టేషన్‌లో అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు కె సూరిబాబు, నగర కమిటీ సభ్యులు జీ వెంకట్రావు, ఎండీ మస్తాన్, కె వెంకటరత్నం, వెంకటేశ్వరరెడ్డి, బాలరాజు, సీహెచ్ దాసు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణోత్సవం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు.స్వామి వారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామివారికి శాంతి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులను మేళతాళాలతో తీసుకొచ్చి కల్యాణోత్సవాన్ని జరిపించారు. తొలుత విష్వక్సేనపూజ, అనంతరం మహాసంకల్పం, ప్రవర, యజ్ఞపవీతధారణ, జీలకర్రబెల్లం ధారణ, మంగళ్యధారణ, చివరిగా తలంబ్రాల సమర్పణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా తిరుమంజనం..

స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయంలోని స్వామి వారి మూలవిరాట్‌కు తిరుమంజన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో స్వామి వారిని అభిషేకించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వైదిక కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి



పార్టీ జిల్లా కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, మహిళలపై పట్టపగలే కూటమి నేతలు ఉన్మాదుల్లా దాడులకు పాల్పడుతున్నారని వైఎస్సార్ సీపీ మహిళా నేతలు మండిపడ్డారు. పోలీసుల సమక్షంలోనే శనివారం గుడివాడలో కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన గూండాలు దాడి చేశారని పేర్కొన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని, దాడికి పాల్పడ్డ గూండాలను పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన గూండాలు దాడి చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా? అని ప్రశ్నిస్తూ నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు.

నిత్యం దాడులు, అత్యాచారాలు

ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, మహిళలపై దాడులు విచ్చలవిడిగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సాక్షాత్తు పోలీసుల సమక్షంలోనే మహిళలపై దాడులు జరుగుతుంటే, ఇక రాష్ట్రంలో మహిళలను కాపాడేది ఎవరని ప్రశ్నించారు. గుడివాడలో జరిగిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యం మహిళలు, బాలికలపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. దీనికి గుడివాడలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌పై చేసిన దాడే నిదర్శనమన్నారు. ఏపీఐడీసీ మాజీ చైర్‌పర్సన్ బండి నాగేంద్ర పుణ్యశీల, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు సంపతి విజిత తదితరులు పాల్గొన్నారు.

జగన్మాతకు ఆషాఢ సారె సమర్పణ



ఆషాఢ సారెతో బయలుదేరిన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి పైగల శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో కొలువై ఉన్న జగన్మాత కనకదుర్గమ్మకు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. విద్యాధరపురం రావిచెట్టు సెంటర్ నుంచి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన బ్రాహ్మణ మహిళలు, అర్చక, పురోహిత, యువజన విభాగానికి చెందిన దాదాపు 200 మంది మంగళ వాయిద్యాల నడుమ పసుపు, కుంకుమ, గాజులు, చలిమిడి, వివిధ రకాల స్వీట్స్‌తో కాలినడకన బయలుదేరారు. జైదుర్గా..జైజై దుర్గా నామస్మరణతో ఇంద్రకీలాద్రిపైకి చేరుకుని అమ్మవారి ఉత్సవ విగ్రహానికి సారె సమర్పించారు. అనంతరం సారెను ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకుని దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ మాట్లాడుతూ రెండేళ్లుగా అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి హెచ్‌కె మనోహరరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు కె.కుసుమకుమారి, ప్రధాన కార్యదర్శి కె.సూర్యకుమారి, కల్చరల్ సెక్రటరీ జి.అపర్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాల అమలుకు డిమాండ్

విద్యాధరపేట(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బాజీబాబా విమర్శించారు. విద్యాధరపేట, నైజాం గేటుసెంటర్‌లోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల పేరుతో ఎన్నికల సమయంలో ఇష్టారీతిన హామీలు ఇచ్చిన ప్రస్తుత సీఎం చంద్రబాబు, అధికారం చేపట్టాక ఆ హామీలను అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో భారం మోపింది నిజం కాదా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గొలగాని శ్రీనివాసరావు, పశ్చిమ నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు బత్తుల పాండు, పశ్చిమ మహిళా అధ్యక్షురాలు దుర్గభవాని పాల్గొన్నారు.

సాహిత్యం సమకాలీనమై ఉండాలి



గ్రంథావిష్కరణ సభలో మహ్మద్ ఇంతియాజ్, గోళ్ల నారాయణరావు, కొల్లూరి తదితరులు

విజయవాడకల్చరల్: సాహిత్యం సమకాలీనమై ఉండాలని కృష్ణాజిల్లా పూర్వపు కలెక్టర్ మహ్మమద్ ఇంతియాజ్ అన్నారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో కవి ఎస్ఆర్ పృథ్వీ రచించిన పగిలిన జీవకలలు దీర్ఘకవిత, నానో ప్రస్తానం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పగిలిన జీవన కలలు గ్రంథాన్ని ఆవిష్కరించిన ఇంతియాజ్ మాట్లాడుతూ కవిత్వంలో సామాజిక స్పృహ కనిపించాలన్నారు. కవులు సమాజాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. ఆధునిక కవిత్వంలో వస్తున్న మార్పులను స్వాగతించాలని సూచించారు. సభను ప్రారంభించిన కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు నేడు కవిత్వంలో వస్తున్న మార్పులను వివరించారు. నానో ప్రస్తనం లఘు కవితా సంపుటిని డెప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎన్‌వీ రమణ ఆవిష్కరించారు. సభకు ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి అధ్యక్షత వహించారు. సాహితీవేత్తలు మంజులూరి కృష్ణకుమారి, కావూరి సత్యవతి, ఎక్స్‌రే ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు, కోశాధికారి సీహెచ్‌వీ సుబ్బయ్య, రచయిత పృథ్వీ పాల్గొన్నారు.

చంద్రబాబుది చీటింగ్ మ్యానిఫెస్టో



సమావేశంలో మాట్లాడుతున్న వెలంపల్లి శ్రీనివాసరావు



చంద్రబాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ ప్లకార్డుతో వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

వెలంపల్లి శ్రీనివాసరావు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చంద్రబాబు అంటేనే మోసమని, ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మరోమారు చీటింగ్ చేశారని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. 46వ డివిజన్‌లోని మేయర్ రాయన భాగ్యలక్ష్మి నివాసంలో పశ్చిమ నియోజకవర్గ 46, 47, 48, 51వ డివిజన్ల మండల స్థాయి నాయకుల విస్తృతస్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు అయితా కృష్ణ కిశోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ 'చంద్రబాబు షూరిటీ– మోసం గ్యారంటీ' అనేవిధంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఎన్నికలలో గెలిపించిన ప్రజలను మ్యానిఫెస్టో ద్వారా ఓడించిన ఘనుడు సీఎం చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో అమలు చేస్తానని చెప్పిన పథకాల కరపత్రాలను చూపుతూ వీటిలో ఎన్ని పథకాలు అమలు చేశారో కూటమి ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉచిత గ్యాస్, ఉచిత బస్సు పథకాలతోపాటు సూపర్‌సిక్స్ పథకాలపై కూటమి నాయకులను ప్రజలు నిలదీయాలన్నారు. రీకాలింగ్ చంద్రబాబు మానిఫెస్టో బ్యానర్‌ను ఆవిష్కరించారు. మోసపూరిత హామీలను ఇచ్చిన చంద్రబాబుకు భవిష్యత్‌లో ప్రజలు తగినరీతిలో బుద్ధిచెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం అమలుచేయని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలందరికీ వివరించాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ, డివిజన్ అధ్యక్షులు వెన్నం రజనీ కుమార్, కూరాకుల నాగ, పిల్లా సూరిబాబు(జగ్గు), గురుమూర్తిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు దాసిన యేసు, జనరల్ సెక్రటరీ బంక రమణ, సూర వెంకట్రావు, బెవర చిన్న, పట్నాల అప్పన్న, షేక్. వలీ, ఆళ్ల రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యసత్య ట్రస్ట్ సేవలు అభినందనీయం



ట్రస్ట్ సభ్యులతో స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పేద విద్యార్థుల చదువుల కోసం సాయం అందిస్తున్న సూర్యసత్య ట్రస్ట్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. కేఎల్‌రావునగర్‌లోని సూర్యసత్య చారిటబుల్ ట్రస్ట్ పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, వృద్ధులకు చీరలు, వికలాంగులకు వీల్‌చైర్స్, చేతి కర్రలను పంపిణీ చేశారు. చైర్మన్ రాజగిరి సోమేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కేబీఎన్ కాలేజీ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ వంగల నారాయణరావు, జనసేన నాయకులు మండలి రాజేష్, ఆంధ్రప్రదేశ్ నగరాల సంఘం అధ్యక్షులు బాయన బాబ్జీ హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ దాతల సహకారం అందుకుంటున్న విద్యార్థులు ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని సూచించారు. ట్రస్ట్ డైరెక్టర్లు రాజగిరి భాస్కరరావు, ఫౌండర్స్ రాజగిరి చంద్రశేఖరరావు, శ్రీనివాసరావు, పవన్‌కుమార్ విదేశాల్లో ఉద్యోగం చేసుకుంటూ వారి సంపాదనలో కొంతభాగం సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శ్రీసాయి సత్య బాబా సేవాసంస్థ అధ్యక్షులు మేక శేఖర్ బాబు, రాజగిరి భాస్కరరావు, నల్లాని సూర్యారావు, ఎన్వీ రావు, రాంపిళ్ల శ్రీనివాసు, పొట్నూరి కృష్ణప్రసాద్, డాక్టర్ గర్రె నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.